ప్రజాశక్తి
బుధవారం 7 డిసెంబర్ 2022
5
విజయనగరం

ఎపిసిపై ఆర్‌జెడి విచారణ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

సమగ్ర శిక్ష ఎపిసి స్వామినాయుడుపై ఇటీవల వచ్చిన పలు ఫిర్యాదులు, ఆరోపణలపై మంగళవారం విద్యాశాఖ రీజనల్ డైరెక్టర్ ఎం. జ్యోతికుమారి విచారణ చేపట్టారు. సర్వశిక్షలో పనిచేస్తున్నపలువురు ఉద్యోగులను అకారణంగా తొలగించారని బాధితులు ఇటీవల రాష్ట్ర ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. ఈనేపథ్యంలో విద్యా శాఖ కమిషనర్ ఆదేశాలు ప్రకారం విచారణ చేపట్టినట్లు ఆర్‌జెడి తెలిపారు. విచారణ నివేదికను ఉన్నతాధికారులకు ఇస్తామని తెలిపారు.

ధాన్యం కొనేవారేరీ?

- కళ్లాల్లో రైతుల జాగరం
- నేటికీ పూర్తిస్థాయిలో ప్రారంభం కాని కొనుగోలు ప్రక్రియ
- అందుబాటులో లేని గోనె సంచులు, హమాలీలు
- వాతావరణ మార్పులతో అన్నదాత ఆందోళన

జిల్లాలో ఖరీఫ్ ధాన్యం ప్రతి గింజను రైతుల వద్దకు వెళ్లి కొనుగోలు చేస్తామని, వారికి ఎటువంటి ఇబ్బందులూ కల్పించబోమని అధికారుల నుంచి ప్రజాప్రతినిధుల వరకు 15 రోజులుగా చెప్పకొస్తూనే ఉన్నారు. ధాన్యం సేకరణకు సరిపడా గోనె సంచెలు ఆర్‌బికె కేంద్రాల వద్ద ఉన్నాయని, రైతులు తీసుకెళ్లొచ్చని అధికారులు చెప్పకొచ్చారు. ఇటీవల ఆ మాటలు మారిపోయాయి. బస్తాలు మీరే తెచ్చుకోండి... ధాన్యం మీరే మిల్లుకు తీసుకుపొండి... ఆ ఖర్చు ప్రభుత్వం భరిస్తుందని ఇప్పుడు మాటమార్చారు. దీంతో రైతులు గందరగోళంలో పడ్డారు. నిన్నటి వరకూ అన్నీ తాము చేస్తామని చెప్పి తీరా ఇప్పుడు మీరే తెచ్చుకోండి... మీరే పంపుకోండి అంటూ అధికారులు చెప్పడంతో ప్రభుత్వం ఎంతో ఆర్భాటంగా ప్రకటించిన మద్దతు ధరకు గండిపడే అవకాశాలున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు.

కళ్లాల్లో ధాన్యం బస్తాలపై కప్పిన టార్పాలిన్లు

ప్రజాశక్తి - విజయనగరం

జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రక్రియ ప్రారంభించినప్పటికీ నామమాత్రంగానే సాగుతోంది. ధాన్యాన్ని కళ్లాల వద్దనే కొనుగోలు చేస్తామని, ధాన్యాన్ని గోనె సంచుల్లో నింపి హమాలీల ద్వారా వాహనాల్లో లోడింగ్ చేసి మిల్లుకు చేర్చే వరకు పూర్తి బాధ్యతలు ప్రభుత్వం తీసుకుంటుందని ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రకటించారు. అయితే నేటి వరకూ ధాన్యం కొనుగోలు ప్రక్రియ అరకొర కేంద్రాల ద్వారా తప్ప పూర్తిస్థాయిలో అమలు కాలేదు. ఇప్పటికే వరికోతలు పూర్తి కావస్తున్నాయి. కొన్ని చోట్ల ధాన్యాన్ని కుప్పలుగా పెట్టగా, మరికొన్ని చోట్ల నూర్పిడి చేసి అమ్మకానికి రైతులు సిద్ధం చేశారు. తీరా కొనేవారు లేక రైతులు కళ్లాల వద్దనే రాత్రీ పగలు కాపలా కాస్తున్నారు. జిల్లా కేంద్రానికి చుట్టుపక్కల ఉన్న మిల్లులు నేటికీ తెరవకపోవడం గమనార్హం. చాలామంది రైతులు తమ పంటను కుప్పలుగా వేసుకొని ప్రభుత్వం కొనుగోలు ప్రక్రియ మొదలుపెట్టే సమయానికి నూర్పిడి చేయవచ్చని ఆలోచనలో ఉన్నారు. రైతుల తాము పండించిన పంటకు గిట్టుబాటు ధర ఎలాగో లేదు కనీసం ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకు కూడా కొనే నాథుడే కరువయ్యాడని ఆందోళన వ్యక్తం చేశారు.

రైతులపై అదనపు భారం

కళ్లాల వద్దే ధాన్యాన్ని సేకరిస్తామని అధికారులు ప్రకటించడంతో సంతోషించిన రైతన్నకు నిరాశ మిగిలింది. రైతులకు హమాలీలను అందుబాటులో ఉంచి వారితోనే ధాన్యాన్ని గోనె సంచుల్లో నింపి వాహనాలకు లోడింగ్ చేస్తామని, రవాణా, సంచులు ఏర్పాటు చేస్తామని, ఖర్చులు మొత్తం ప్రభుత్వమే భరిస్తుందని అధికారులు ప్రకటించారు. ప్రస్తుతం రైతులే గోనె సంచులు ఏర్పాటు చేసుకోవాలని, అందుకయ్యే ఖర్చులకు గాను 40 కేజీలు సామర్థ్యం గల గోనె సంచికి రూ.3.90 చెల్లిస్తామని చెబుతున్నారు. అయితే మార్కెట్లో గోనెసంచె ధర 10 నుండి 12 రూపాయలు పలుకుతుంది. దీనికోసం రైతులు అదనంగా 6 నుంచి 8 రూపాయలు భరించాల్సి వస్తుంది. జిల్లా కేంద్రంలోని ఆర్‌బికెల్లోనే గోనె సంచులు అందుబాటులో లేకపోవడం గమనార్హం. అయితే చిన్న, సన్నకారు రైతులు పండించిన ధాన్యాన్ని మిల్లులకు చేర్చడానికిగాను తమకు గిట్టుబాటు కాదని, వాహనదారులు ముందుకు రావడం లేదని వాపోతున్నారు. కొన్నిచోట్ల ఇద్దరు, ముగ్గురు రైతుల ధాన్యాన్ని ఒకే వాహనంలో సర్దుబాటు చేసి రవాణాకు ఏర్పాట్లు చేస్తున్నప్పటికీ, ధాన్యం దొంగలు, ప్రకృతి వైపరీత్యాల బారినపడి నష్టపోకుండా రైతులు కళ్లాల వద్ద కాపలా కాయాల్సిన పరిస్థితి దాపురించింది.

రెండు రోజులుగా తుపాను హెచ్చరికల నేపథ్యంలో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం సరిపడా గోనెసంచులు, రవాణా సౌకర్యం, మిల్లులను అందుబాటులోకి తీసుకొచ్చి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

కళ్లంలో పోసిన ధాన్యం

హోంగార్డుల నుంచి గౌరవ వందనం స్వీకరిస్తున్న ఎస్‌పి ఎం.దీపిక

హోంగార్డుల సేవలు ఎనలేనివి

ఆవిర్భావ దినోత్సవంలో ఎస్‌పి దీపిక

ప్రజాశక్తి-విజయనగరం

పోలీసులతో సమానంగా హోంగార్డుల అందిస్తున్న సేవలు ఎనలేనివని ఎస్‌పి ఎం.దీపిక అన్నారు. 60వ హోంగార్డు ఆవిర్భావ దినోత్సవం జిల్లా పోలీసు పరేడ్ గ్రౌండులో మంగళవారం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన ఎస్‌పి హోంగార్డుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం మాట్లాడుతూ పోలీసు వ్యవస్థలో హోంగార్డులు కీలకంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. సాంకేతిక పరిజ్ఞానంను కూడా పెంపొందించుకొని, కంప్యూటరు ఆపరేటర్లగా, డ్రైవర్లుగా పని చేస్తున్నారన్నారు. వీరి సేవలను రాష్ట్ర ప్రభుత్వం గుర్తించి ప్రతినెలా వేతనంతో కూడిన 2 రోజుల సెలవులు, మహిళా హోంగార్డులకు మూడు నెలల మెటర్నిటీ సెలవులు, ప్రమాదాల్లోను, విధుల్లోను మరణించిన హోంగార్డు కుటుంబాలకు రూ.5లక్షలు ఎక్స్‌గ్రేషియా, కొన్ని రాయితీలను అందిస్తున్నట్లు తెలిపారు. హోంగార్డులు మృతిచెందినా, ఉద్యోగ విరమణ చేసినా ప్రభుత్వం నుంచి ఎటువంటి ఆర్థిక రాయతీలు వచ్చే అవకాశం లేనందున హోంగార్డులు ఒక్కరోజు వేతనాన్ని వారి కుటుంబాలకు చేయూతగా అందిస్తున్నామన్నారు. నీతి, నిజాయితీ, అంకితభావంతో పని చేసి జిల్లా పోలీసుశాఖకు మంచి పేరును తీసుకు రావాలని పిలుపునిచ్చారు. అనంతరం విధి నిర్వహణలో ప్రతిభ కనబర్చిన హోంగార్డులకు ఎస్‌పి ప్రశంసా పత్రాలను అందజేసారు. హోంగార్డులు నిర్వహించిన కవాతు పలువురిని ఆకట్టుకుంది. ఈ సందర్భంగా జిల్లా పోలీసు కార్యాలయం నుండి ఆర్ అండ్ బి బంగ్లా వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎఆర్ అదనపు ఎంఎం సోల్మన్, ఎఆర్ డిఎస్‌పి ఎల్. శేషాద్రి, డిఎస్‌పిలు ఆర్.శ్రీనివాసరావు, ఎం.వెంకటేశ్వర్లు, డిపిఒ వెంకటరమణ, రిజర్వు ఇన్‌స్పెక్టర్లు పి. నాగేశ్వరరావు, చిరంజీవి, మరియన్ రాజు, రమణమూర్తి, సిఐలు బి. వెంకటరావు, జి.రాంబాబు, రుద్రశేఖర్, సిహెచ్. లక్ష్మణరావు, టి.వి. తిరుపతిరావు, ఇ. నర్సింహమూర్తి, ఆర్‌ఎస్‌ఐలు పాల్గొన్నారు.

పావురాలను ఎగురవేస్తున్న ఎస్‌పి దీపిక

మాట్లాడుతున్న పరిశీలకులు బాబు

ఓటర్ల నమోదులో బిఎల్‌ఒలే కీలకం

- పరిజ్ఞానం, అర్హత కలిగిన వారే బాధ్యతలను నిర్వర్తించాలి
- ప్రజా ప్రతినిధులతో ఓటర్ల జాబితా పరిశీలకులు ఎ.బాబు

ప్రజాశక్తి-విజయనగరం

ఓటు నమోదు ప్రక్రియలో బిఎల్‌ఒల పాత్రే కీలకమని, కనీస పరిజ్ఞానం, అర్హత కలిగిన వారికే సంబంధిత బాధ్యతలు అప్పగించాలని ఓటర్ల జాబితా పరిశీలకులు ఎ. బాబు పేర్కొన్నారు. బిఎల్‌ఒలు ప్రతి ఇంటికీ వెళ్లాలని, సంబంధిత ప్రక్రియలో ఇఆర్‌ఒలు, ఎఇఆర్‌ఒలు భాగస్వామ్యం కావటం ద్వారా తప్పిదాలు జరగకుండా చూసుకోవాలని చెప్పారు. ఓటు నమోదు ప్రక్రియ, ఓటర్ల జాబితా నిర్వహణ తదితర అంశాలపై మంగళవారం కలెక్టరేట్‌లో జిల్లా అధికారులు, ప్రజా ప్రతినిధులతో సమావేశమయ్యారు.ఓటు నమోదు ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని పేర్కొన్నారు. ప్రజలకు తెలిసే విధంగా ప్రతి కార్యాలయంలో బిఎల్‌ఒల విధులు, వివరాలు పేర్కొంటూ బోర్డులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. యువ ఓటర్ల నమోదుపై దష్టి సారించాలని, కళాశాలలకు వెళ్లాలని ఆదేశించారు. పండగల సమయంలో స్వస్థలాలకు వచ్చే యువతపై కూడా దృష్టి సారించి ఓటు కల్పించాలని సూచించారు. ఓటు నమోదు ప్రక్రియలో గానీ, జాబితా రూపొందించటంలో గానీ అలసత్వం ప్రదర్శించినా, నిర్లక్ష్యం వహించినా సంబంధిత బిఎల్‌ఒలపై చర్యలు తప్పవని పరిశీలకులు హెచ్చరించారు

సమస్యలుంటే నన్ను సంప్రదించండి

ఓటు నమోదు ప్రక్రియకు సంబంధించిన సమస్యలపై తనను సంప్రదించవచ్చని ఓటర్ల జాబితా పరిశీలకులు ఎ. బాబు తెలిపారు. ఎవరికైనా సమస్యలు ఉంటే నేరుగా తన ఫోన్ నెంబరు 94414 12121ను లేదా ababu@ ias.nic.in మెయిల్ ను సంప్రదించవచ్చని సూచించారు. జిల్లాలో జరుగుతున్న ఓటు నమోదు ప్రక్రియపై ప్రజాప్రతినిధులు సంతృప్తి వ్యక్తం చేశారు. కలెక్టర్ ఎ. సూర్యకుమారి, జెసి మయూర్ అశోక్, డిఆర్‌ఒ గణపతిరావు, పలుపార్టీల నాయకులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరానికి స్పందన

ప్రజాశక్తి-విజయనగరం

డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా స్థానిక కోట జంక్షన్ వద్దగల ఎన్‌విఎన్ బ్లడ్ బ్యాంక్‌లో విజయనగరం యూత్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్వచ్ఛంద రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించింది. జిల్లాలో రక్తం నిల్వలు కొరత కారణంగా ఈ రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు అధ్యక్షులు షేక్.ఇల్తామాష్ తెలిపారు. ముఖ్యఅతిథిగా హాజరైన గోవిందపురం సర్పంచ్ అప్పల రాజు మాట్లాడుతూ రక్తదానం ప్రాణదానం తో సమానమని,18 సంవత్సరాలు నిండిన అందరూ కూడా రక్తదానం చేయొచ్చని తెలిపారు. సుమారు 76 మంది స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. కార్యక్రమంలో యునైటెడ్ కలాం ఫౌండేషన్ అధ్యక్షులు మమ్ముల తిరుపతిరావు, యూత్ ఫౌండేషన్ సభ్యులు అశోక్, సాయి, రాయల్ క్యాబ్స్ శరత్ తదితరులు పాల్గొన్నారు.

వికలాంగుల్లో మనోధైర్యం నింపాలి

వికలాంగులలో మనోధైర్యం నింపే ప్రయత్నం చేయాలని నగర డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి అన్నారు. మంగళవారం ప్రపంచ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం సందర్భంగా వెంకటలక్ష్మి థియేటర్ జంక్షన్లో విజయ దుర్గ వికలాంగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. వైకల్యం అనేది విజయ సాధనకు అడ్డు కాదని, కృషి పట్టుదల ఉంటే ఎంతటి విజయాన్నైనా సాధించవచ్చని అన్నారు. అంగవైకల్యం కలిగినప్పటికీ ఎంతో కష్టపడి ఐఎఎస్ సాధించిన రోణంకి గోపాలకష్ణ, కట్ట సింహాచలం జీవితాలు భావితరాలకు ఆదర్శమని అన్నారు. ఈ సందర్భంగా రక్తదానం చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో లోక్‌సత్తా రాష్ట్ర అధ్యక్షులు భీశెట్టి బాబ్జీ, వికలాంగులసంక్షేమశాఖ ఎడి తదితరులు పాల్గొన్నారు.

శరవేగంగా ఇళ్ల నిర్మాణాలు : కలెక్టర్

వర్షాల పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలి • ప్రతిభ చూపిన విద్యార్థులకు అభినందన

ప్రజాశక్తి-గంట్యాడ

ఈ నెల 21న సామూహిక గృహప్రవేశాలు నిర్వహించేందుకు ఇళ్ల నిర్మాణాన్ని శరవేగంగా పూర్తి చేయాలని గృహ నిర్మాణ శాఖాధికారులను కలెక్టర్ ఎ.సూర్యకుమారి ఆదేశించారు. ఆమె మంగళవారం స్థానిక తహాశీల్దార్ కార్యాలయంలో పలు శాఖల అధికారులతో సమీక్షించారు. ఇప్పటికీ మొదలుపెట్టని ఇళ్లను, తక్షణమే నిర్మాణాన్ని ప్రారంభించి, ఈ నెలాఖరునాటికి పునాదులను పూర్తి చేయాలని ఆదేశించారు. వాలంటీర్ల ద్వారా లబ్దిదారులను చైతన్యపరచాలని సూచించారు. సమావేశంలో జిల్లా గృహనిర్మాణ శాఖాధికారి ఎన్‌వి రమణమూర్తి, తాహాశీల్దార్ శ్రవణ్‌కుమార్, ఇన్‌ఛార్జి ఎంపిడిఒ భానూజీరావు, హౌసింగ్ అధికారులు పాల్గొన్నారు.

మరో రెండు రోజుల్లో వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున, రైతులు నష్టపోకుండా అప్రమత్తం చేయాలని మండల వ్యవసాయాధికారులకు కలెక్టర్ సూచించారు. వర్షాల ముప్పు పూర్తిగా తొలగిపోయేవరకు, వరి నూర్పుళ్లు చేయకుండా రైతులను హెచ్చరించాలని కోరారు. వరికోతలు మొదలైన చోట్ల వెంటనే కొనుగోలు కేంద్రాలను తెరవాలని ఆదేశించారు. ఎఒ శ్యామ్‌కుమార్, సిఎస్‌డిటి ఇందిర సమావేశంలో ఉన్నారు. అర్హత ఉన్న ప్రతీ ఒక్కరికీ ఓటుహక్కు కల్పించాలని, బూత్ స్థాయి అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను, ఎంఎల్‌సి ఓటర్ల నమోదును పరిశీలించారు. తాహాశీల్దార్ శ్రవణ్‌కుమార్, డిటి సంతోష్, బిఎల్‌ఒలు ఉన్నారు.

విద్యార్థులను అభినందించిన కలెక్టర్

నిర్మాణాత్మక మూల్యాంకణ పరీక్షల్లో (ఎఫ్ఎ 1) అత్యుత్తమ ప్రతిభ చూపిన స్థానిక జెడ్‌పి హైస్కూలు విద్యార్థులను కలెక్టర్ అభినందించారు. తరగతుల వారీగా అత్యధిక మార్కులను పొందిన విద్యార్థులతో ఆమె మచ్చటించారు. పాఠశాలలో మధ్యాహ్న భోజనంలో అమలు చేస్తున్న మెనూపై ఆరా తీశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఝాన్సీ, పీడీ సన్యాసినాయుడు ఉన్నారు.

సేవలను మరింత విస్తృతం చేయాలి

సచివాలయాల ద్వారా అందిస్తున్న సేవలను మరింత విస్తృతం చేయాలని కలెక్టర్ సూచించారు. కొర్లాం గ్రామ సచివాలయాన్ని తనిఖీ చేశారు. ర్హత ఉన్నవారందరికీ ఓటుహక్కు కల్పించాలని ఆదేశించారు. సచివాలయాల ద్వారా ప్రజలకు అందిస్తున్న సేవలను మరింత విస్తృతం చేయాలని సిబ్బందిని కలెక్టర్ ఆదేశించారు. తహాశీల్దార్ స్వర్ణకుమార్, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ సూర్యకుమారి

గృహనిర్మాణ ప్రగతిపై కలెక్టర్ ఆగ్రహం

విజయనగరం రూరల్ : గుంకలాం జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణ ప్రగతిపై కలెక్టర్ ఎ.సూర్యకుమారి అసంతృప్తి వ్యక్తం చేశారు. మంగళవారం ఇళ్ల నిర్మాణాన్ని పరిశీలించారు. ముఖ్యంగా కాంట్రాక్టుకు ఇచ్చిన ఇళ్ల నిర్మాణం నత్తనడకన సాగుతుండటంపై, సంబంధిత ప్రాజెక్టు మేనేజరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మేస్త్రీలను, పనివారిని ఎక్కువమందిని వినియోగించి, ఇళ్ల నిర్మాణాన్ని వేగవంతం చేయాలని ఆదేశించారు. ఇటుకల తయారీ యూనిట్‌లో ఉత్పత్తి పెంచాలని, నాణ్యత ఎక్కడా తగ్గకుండా చూడాలని సూచించారు. పర్యటనలో జిల్లా గృహనిర్మాణ శాఖాధికారి ఎన్‌వి రమణమూర్తి, డిఇ రంగారావు, ఎఇ శ్రీనివాసరావు, ప్రాజెక్టు మేనేజర్ శ్రావణ్ ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

పైడితల్లి ఆలయ అభివృద్ధికి త్వరలో శ్రీకారం

డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

పైడితల్లమ్మ వారి ఆలయ అభివృద్ధి పనులకు త్వరలో శ్రీకారం చుట్టనున్నట్లు డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి వెల్లడించారు. మంగళవారం అమ్మవారిని దర్శించుకున్న అనంతరం ఆలయ ప్రాంగణంలో మీడియాతో మాట్లాడారు. పైడితల్లమ్మ ఆలయ విస్తరణకు అన్ని అడ్డంకులూ తొలగిపోయాయన్నారు. చుట్టుపక్కల ప్రాంతాల వారు అమ్మవారి ఆలయం ఎదురుగా ఉన్న ప్రాంతంలో నిర్మాణాలు చేపట్టేందుకు ముందుకు వచ్చారన్నారు. దీంతో ప్రభుత్వం అప్పట్లో ప్రకటించిన పరిహారం కన్నా ప్రస్తుతం ఉన్న రేట్లు ప్రకారం పరిహారాన్ని వారికి అందజేస్తుం దన్నారు మంగళవారం ఖాదీ వస్త్రాలయం షాపు యజమానికి నష్టపరిహారం కింద చెక్కును అందించా మన్నారు. త్వరలోనే మంత్రి బొత్స సత్యనారాయణ సూచన లతో అమ్మవారి ఆలయ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ కిషోర్ కుమార్, ఆలయ కమిటీ సభ్యులు అచ్చిరెడ్డి, పతివాడ వెంకటరావు, వెత్స శ్రీనివాసరావు, చిల్ల పుష్ప, గంధం లావణ్య, బలివాడ పార్వతి, రామ్ సింగ్ సూరమ్మ, పార్టీ నాయకులు బలివాడ కాశీ, గంధం హరిబాబు, ఆలయ అధికారులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే గడప గడపకూ

సమస్యల పరిష్కారానికే గడప గడపకూ ప్రభుత్వం కార్యక్రమం చేపడుతున్నామని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. మంగళవారం 37వ డివిజన్‌లో కోలగట్ల పర్యటించారు. స్థానిక సమస్యలపై ప్రజలు స్పందిస్తూ ముఖ్యంగా తమ ప్రాంతంలో విద్యుత్ తీగలు ఇళ్ల మధ్యలో ఉండడాన్ని డిప్యూటీ స్పీకర్ దృష్టికి తీసుకుని వచ్చారు. తక్షణమే స్పందించిన ఆయన సంబంధిత అధికారులకు సమస్య పరిష్కారానికి చొరవ చూపాలని ఆదేశించారు. ఇంటింటికి వెళుతూ ప్రభుత్వ పథకాల తీరును అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వైసిపినగర అధ్యక్షులు ఆశపు వేణు, జోనల్ ఇన్‌ఛార్జి డాక్టర్ విఎస్ ప్రసాద్, సహాయ కమిషనర్ ప్రసాదరావు, స్థానిక కార్పొరేటర్ కడియాల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పథకాలు గురించి ఆరా తీస్తున్న కోలగట్ల వీరభద్రస్వామి

కార్పొరేషన్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న రామకృష్ణానగర్ వాసులు

సమస్యలు పరిష్కరించాలని ధర్నా

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

రామకృష్ణ నగర్ కాలనీలో సమస్యలు పరిష్కరించాలని సిపిఎం నగర కార్యదర్శి రెడ్డి శంకరరావు డిమాండ్ చేశారు. మంగళవారం కాలనీ వాసులతో కలిసి కార్పొరేషన్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2019 నుంచి కడుతున్న ఇంటి పన్నులు నిలిపివేశారని, వెంటనే పన్నులు వసూలు చేయాలని డిమాండ్ చేశారు. కాలనీలో నిర్మించిన మరుగుదొడ్లను వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేశారు. ప్రహరీ గోడ లేకపోవడం వలన దుర్గంధంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ధర్నాలో ఎం.జగదాంబ, ఎం.శాంతమూర్తి, కాలనీ వాసులు పాల్గొన్నారు.

లక్ష్య సాధనకు వైకల్యం అడ్డుకాదు

విజయనగరంటౌన్ : వైకల్యం అనేది లక్ష్య సాధనకు అడ్డు కాదని, కృషి, పట్టుదల ఉంటే ఎంతటి విజయాన్ని అయినా సాధించవచ్చు అని వైసిపి యువజన విభాగం నాయకులు జి.ఈశ్వర్ కౌశిక్ అన్నారు. జిల్లా స్పోర్ట్స్ ఫెడరేషన్ ఆఫ్ ది డే కు చెందిన 21 మంది బదిర విద్యార్థులు ఈనెల 8నుంచి పదో తేదీ వరకు పశ్చిమగోదావరి జిల్లాలో జరిగే బధిరుల సీనియర్ స్పోర్ట్స్ ఛాంపియన్ షిప్, జూనియర్ ఛాంపియన్ షిప్ క్రీడా పోటీలకు వెళ్లనున్న బధిరుల క్రీడాకారులకు ఈశ్వర్ కౌశిక్, శ్రావణి దంపతులు రూ.25 వేలు విలువగల క్రీడా దుస్తులను అందజేశారు.

సిఎం కప్ ప్రైజ్‌మనీ జోనల్ క్రికెట్ పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

జిల్లా నుంచి పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు జోనల్ స్థాయితో పాటు, రాష్ట్ర స్థాయిలో బాగా ఆడి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలనిజాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ పేర్కొన్నారు. సిఎం ప్రైజ్ మనీ కప్ టోర్నమెంట్‌లో భాగంగా మంగళవారం విజ్జి స్టేడియం వేదికగా జోనల్ క్రికెట్ పోటీలను ఎమ్మెల్సీ సురేష్ బాబు, డిప్యూటీ మేయర్ శ్రావణిలో కలిసి జెసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్రీడా వసతుల కల్పనలో సమష్టి కృషి అవసరమని పేర్కొన్నారు. ఈ క్రమంలో జెసి క్రికెట్ ఆడి అందరినీ అలరించారు. రెండు రోజుల పాటు జరిగే క్రీడా పోటీల్లో విశాఖపట్నం, శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, పాడేరు, అనకాపల్లి, విజయనగరం జిల్లాల నుంచి క్రీడాకారులు పాల్గొంటారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ సురేష్ బాబు, డిప్యూటీ మేయర్ రేవతి, జిల్లా కబడ్డీ అసోషియేషన్ ప్రెసిడెంట్ కౌశిక్, డిఎస్‌డిఒ అప్పలనాయుడు, వివిధ క్రీడా సంఘాల ప్రతినిధులు, సభ్యులు, అధిక సంఖ్యలో క్రీడాకారులు పాల్గొన్నారు.

జెపిఎల్ లోగో ఆవిష్కరణ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి 50వ జన్మదినం సందర్భంగా జిల్లా వైఎస్‌ఆర్ కాంగ్రెస్ నాయకులు అవనాపు విక్రమ్, ఉమ్మడి విజయనగరం జిల్లా డిసిఎంఎస్ చైర్ర్సన్ డాక్టర్ అవనాపు భావన సారధ్యం లో నిర్వహించే జగనన్న ప్రీమియర్ లీగ్ (జెపిఎల్) క్రికెట్ టోర్నీ పోస్టర్లను విజయవాడలో పార్టీ నేతల చేతులమీదుగా విడుదల చేశారు. వైసిపి రాష్ట్ర కో-ఆర్డినేటర్ విజయసాయిరెడ్డి రెడ్డి , విశాఖ, అనకాపల్లి, విజయనగరం జిల్లాల రీజనల్ కో-ఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి, విద్యాశాఖా మంత్రి శ్రీ బొత్స సత్యనారాయణ, జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు పోస్టర్‌ను ఆవిష్కరించారు. విజయనగరంలో 50టీములతో జెపిఎల్ పేరిట నిర్వహిస్తున్న ఈ టోర్నీలో విన్నర్స్‌కు రూ.50 వేలు, రన్నర్స్‌కు రూ.25వేలు నగదు బహుమతి అందిస్తున్నట్లు అవనాపు విక్రమ్ తెలిపారు. ఈ సందర్భంగా వీరిని పార్టీ నాయకులు అభినందించారు.

జెపిఎల్ లోగోను ఆవిష్కరిస్తున్న ఎమ్‌పి విజయసాయిరెడ్డి, జెడ్‌పి చైర్మన్

ప్రజాశక్తి
www.prajasakti.com

వైసిపితో బిసిలకు న్యాయం : ఎమ్మెల్యే

బొబ్బిలి: వైసిపితోనే బిసిలకు న్యాయం జరుగుతుందని ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు అన్నారు. ఆ పార్టీ కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ బిసిల అభివృద్ధి కోసం పని చేస్తున్న వైసిపిపై టిడిపి నాయకులు అవాకులు,చవాకులు పేలడం సరికాదన్నారు. కోర్టుల ద్వారా ఎన్ని అవరోధాలు సృష్టించినపా సంక్షేమం, అభివృద్ధి క్యాలెండర్ ప్రకారం అమలు చేస్తున్నామన్నారు. టిడిపి మాయ మాటలను నమ్మే స్థితిలో ప్రజలు లేరన్నారు.

కల్వర్టు పనులు వేగవంతం

బొబ్బిలి : జగనన్న కాలనీల్లో కల్వర్టు పనులు వేగవంతం చేయాలని మున్సిపల్ కమిషనర్ ఎస్.శ్రీనివాసరావు కోరారు. కల్వర్టు పనులను మంగళవారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పనుల్లో నాణ్యత పాటించాలన్నారు. అనంతరం మున్సిపల్ కార్యాలయంలో జగనన్న ఇళ్ల నిర్మాణాలపై సచివాలయ, మున్సిపల్ అధికారులతో సమావేశం నిర్వహించి ఇళ్ల నిర్మాణాలకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇళ్ల నిర్మాణాల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఎస్ఇబి స్టేషన్‌లో వాహనాల వేలం

బొబ్బిలి : స్పెషల్ ఎన్‌ఫోర్సుమెంట్ బ్యూరో స్టేషన్‌లో ఈనెల 10న వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలను వేలం వేయనున్నట్లు స్టేషన్ హౌస్ ఆఫీసర్ ఆర్.జైభీమ్ తెలిపారు. ఎస్ఇబి సూపరింటెండెంట్ శైలజా రాణి ఆధ్వర్యంలో వేలం పాట జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని ఔత్సహికులు అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

జయకృష్ణకు సన్మానం

వంగర : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆంగ్ల ఉపాధ్యాయునిగా పనిచేస్తున్న ఆంగ్ల పుస్తక రచయిత ఎస్. జయకృష్ణను మండల అధికారులు మంగళవారం ఘనంగా సన్మానించారు. జయకృష్ణ ఆంగ్ల ఉపాధ్యాయ హ్యాండ్ బుక్ స్మార్ట్ రచయితగా గుర్తింపు పొందడంతో పాటు, పార్వతీపురం మన్యం జిల్లా స్పోకెన్ ఇంగ్లీష్ నోడల్ అధికారిగా ఎంపిక కావడం పట్ల హర్షం వ్యక్తం చేసి మండల డిప్యూటీ తహశీల్దార్ బి. సుందరరావు, మండల పరిషత్ సూపరింటెండెంట్ లోపింటి త్రినాధరావు, మండల విద్యాశాఖ అధికారి వై. దుర్గారావు చేతులు మీదుగా జయకృష్ణకు సాలువాతో సత్కరించారు. మరిన్ని ఉన్నత శిఖరాలు అవరోదించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రవణమ్మ, హెచ్ఎం నోడల్ అధికారి నాగభూషణ దొర, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు చట్టాలపై అవగాహన

వేపాడ : విద్యార్థలకు చట్టాలపై అవగాహన అవసరమని సిఐ సింహాచలం నాయుడ అన్నారు. స్థానిక అంబేద్కర్ గురుకులంలో మంగళవారం సాయంత్రం ఆయన చట్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెల్‌ఫోన్లలో వచ్చే మెసేజ్‌లు, లింకులను ఓపెన్ చేయడం వల్ల కలుగు నష్టాలను వివరించారు. విద్యార్థులు చదువు మీద శ్రద్ధ వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వల్లంపూడి ఎస్ఐ రాజేష్, పాఠశాల ప్రిన్సిపల్ యు. ఉషారాణి, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

కళా ఉత్సవాల్లో మొయిద విద్యార్థుల ప్రతిభ

నెల్లిమర్ల : జిల్లా స్థాయి కళా ఉత్సవ పోటీల్లో మొయిద జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచినట్లు హెచ్.ఎం మద్దిల శ్రీనివాసరావు తెలిపారు. మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ డైట్‌లో రెండ రోజులు పాటు జరిగిన జిల్లా స్థాయి కళా ఉత్సవ పోటీల్లో పాఠశాలకు చెందిన ఎన్. దిలీప్ కుమార్, ఆన్ నందిని ఫోక్ డాన్స్‌లో ప్రథమ, డి.ఇందుమతి ఫోక్ సాంగ్‌లో ద్వితీయ, మోనో ఏక్షన్‌లో మరొకరికి బహుమతి లభించందని తెలిపారు.

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం

దత్తిరాజేరు: గర్భిణులు, బాలింతలు తగు మోతాదులో పౌష్టికాహారం తీసుకున్నప్పుడే సంపూర్ణ ఆరోగ్యం పొందగలరని సూపర్‌వైజర్ శ్యామలత అన్నారు. మండలంలో వి.కృష్ణాపురం గ్రామంలో మంగళవారం గర్భిణులు, బాలింతలతో నిర్వహించిన సమావేశంలో ఈమె మాట్లాడారు. గర్భం దాల్చిన సమయంలో తరచూ స్కానింగ్‌లు చేయించుకోరాదని, వైద్యులు సూచనలు సలహాలు మేరకే మందులు వినియోగిస్తూ ఆహర నియమాలు పాటించాలని సూచించారు. కాన్పుకు కాన్పుకు మధ్య మూడు సంవత్సరాలు కాలవ్యవధి ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మార్పిన ఎర్రయ్యమ్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

పాఠశాల పరిశీలన

వేపాడ : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్ వల్లి మంగళవారం పరిశీలించారు. విద్యార్థులకు ఇస్తున్న మధ్యాహ్న భోజనం, నాడు నేడు అభివృద్ధి పనులను పరిశీలించారు. పాఠశాలలో గణితం, ఇంగ్లీషు, తెలుగుకు సంబంధించిన బోధన వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ పరిశీలనలో సిఆర్‌పి వై. లక్ష్మి పాల్గొన్నారు.

అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు

మెంటాడ : మద్యం విక్రయాల్లో అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎక్సైజ్ ఎస్ఐ విఎన్‌రాజు హెచ్చరించారు. మండల కేంద్రంలోని రెండు మద్యం దుకాణాలను ఆయన మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆ దుకాణాల్లోని మద్యం నిల్వల రిజిస్టర్‌లను, నగదు లావాదేవీలు తనిఖీ చేపట్టారు. ఆయా షాపులు నిర్వాహణ పై ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మద్యం దుకాణాల సూపర్ వైజర్‌లు హేమంత్ కుమార్, తిరుపతిరావు, సిబ్బంది సేనపతి సురేష్ కుమార్, కిశోర్ కుమార్, క్రాంతి కుమార్, జలుమూరు రాజు, పాండ్రంకి రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

వేధింపులపై కేసు నమోదు

వంగర : తనకు వివాహం అయినప్పటి నుంచి తన భర్త ఎలువాడ శంకరరావుతో పాటు, అత్త, ఆడపడుచులు శారీరకంగా, మానసికంగా హింసిస్తున్నారని వీరఘట్ట మండలం రేగులపాడు గ్రామానికి చెందిన ఎలువాడ శాంతి వంగర పోలీసులకు మంగళవారం ఫిర్యాదు చేశారు. ఆమె కన్నవారు స్వగృహం వంగర మండలం శ్రీహరిపురం కావడంతో ఆమె ఇక్కడ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఎస్ఐ బుడుమూరు లోకేశ్వరరావు వేధింపుల కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఫిజియోథెరపీతో మేలు

రేగిడి : ఫిజియోథెరపీతోఁ శారీరక సమస్యలు నయమవుతాయని ఆర్థోపెటిక్ వైద్యులు లక్ష్మీ ప్రసన్న, ఎంఇఒ ఎం వరప్రసాదరావు అన్నారు. మంగళవారం స్థానిక ఎంఆర్‌సి కార్యాలయంలో వికలాంగ విద్యార్థులకు ఫిజియోథెరపీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వికలాంగ విద్యార్థులకు వారి తల్లిదండ్రులు ఇంటి వద్ద రెండు పూటలు ఫిజియో థెరిపి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐఇఆర్ ఉపాధ్యాయులు రాంబాబు, మహేశ్వరి, కోఆర్డినేటర్ శ్రీనివాసరావు, కేర్ టేకర్ అనురాధ, సిఆర్‌పిలు పాల్గొన్నారు.

అభివృద్ధి చేసే బాధ్యత సర్పంచులదే

రేగిడి : ప్రణాళిక బద్ధంగా గ్రామ పంచాయతీలను అభివృద్ధి చేసే బాధ్యత గ్రామ సర్పంచులదేనని ఎంపిడిఒ గన్నవరపు కాశీ విశ్వనాథ రావు అన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో సర్పంచులు, కార్యదర్శులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2023- 24 ఆర్థిక సంవత్సరానికి గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో ఇఒఆర్‌డి నాగభూషణరావు, ఎపిఎం మంగమ్మ పాల్గొన్నారు.

వ్యవసాయ గణన పూర్తి చేయాలి

నెల్లిమర్ల : వ్యవసాయ గణన త్వరితగతిన పూర్తి చేయాలని తహశీల్దారు కె. వి. రమణ రాజు సూచించారు. మంగళవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో సహాయ గణాంకాధికారి ఆధ్వర్యంలో వీఆర్వోలతో ప్రపంచం వ్యవసాయ గణన సంధర్భంగా సమావేశం నిర్వహించారు. తహశీల్దార్ మాట్లాడుతూ వ్యవసాయ భూములు, ఏ పంటలు సాగు చేస్తున్నారో వివరణాత్మంగా గణన చేయాలని సూచించారు. గణన వల్ల వ్యవసాయ భూములు, పంటలు వివరాల సర్వే జరిపి నివేదికలు తయారు చేసి అందించాలని ఆదేశించారు. ఎటువంటి తేడాలు లేకుండ ఈ నెలాఖరులోగా వ్యవసాయ భూములు, పంటలు, రైతుల వివరాలు సర్వే, గణన పూర్తి చేయాలని సూచించారు. ఈ సమావేశంలో ఏఎస్ఓ కె. విజయ లక్ష్మి, వీర్వోలు పాల్గొన్నారు.

నేడు జిల్లాస్థాయి త్రోబాల్ ఎంపిక పోటీలు

శృంగవరపుకోట : పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో బుధవారం ఎస్‌జిఎఫ్ జిల్లాస్థాయి అండర్ 14,17 బాయ్స్ అండ్ గర్ల్స్ త్రోబాల్ సెలెక్షన్స్ నిర్వహిస్తున్నట్లు పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ లక్ష్మణరావు మంగళవారం తెలిపారు. ఈ సెలక్షన్స్ లో జిల్లాలో ఉన్న అన్ని నియోజకవర్గస్థాయి పోటీలలో ఇదివరకే ఎంపికైన క్రీడాకారులు పాల్గొనాలని ఆయన కోరారు. పాల్గొనే క్రీడాకారులకు భోజనంతో పాటు అన్ని వసతులూ ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు.

అణగారిన వర్గాల్లో వేగుచుక్క అంబేద్కర్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

విజయనగరం: అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల

అంతర్జాతీయ స్థాయిలో భారతదేశ ఖ్యాతిని నిలబెట్టిన మహనీయుడు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ అని శాసనసభ ఉపసభాపతి కోలగట్ల వీరభద్ర స్వామి అన్నారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 62 వ వర్ధంతి సందర్భంగా బాలాజీ జంక్షన్ వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అణగారిన వర్గాల జీవితాలలో వెలుగులు నింపిన వేగుచుక్క డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ అని కొనియాడారు. నగరంలోని బాలాజీ కూడలిని అంబేద్కర్ జంక్షన్‌గా మార్చడంతో ఇక్కడ 12 అడుగుల కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. ప్రస్తుతం ఉన్న 10 అడుగుల సర్కిల్ పరిధిని 20 అడుగులకు పెంచుతూ పాదచారులు సేదదీరేందుకు ఆహ్లాదకర వాతావరణన్ని నెలకొల్పే ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఏప్రిల్ 14వ తేదీ అంబేద్కర్ జయంతి నాటికి విగ్రహ ఏర్పాటు పూర్తి చేసి ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో కమిషనర్ ఆర్ శ్రీరాముల నాయుడు, వైసిపి నగర అధ్యక్షులు ఆసపు వేణు,ఫ్లోర్ లీడర్ ఎస్‌వివి రాజేష్, దళిత నాయకులు రొంగలి పోతన్న, పీరుబండి జైహింద్ కుమార్, ఆదాడ మోహన్‌రావు వెంకటరమణ, కార్పొరేటర్లు, దళిత సంఘాల నాయకులు, అంబేద్కర్ అభిమానులు పాల్గొన్నారు.

విజయనగరం టౌన్ : రాజ్యాంగ రూప శిల్పి అంబేద్కర్ వర్ధంతి సభ సెంట్రల్ ట్రైబల్ యూనివర్శిటీ లో విసి ప్రొఫెసర్ తేజస్వి కట్టిమని అంబేద్కర్ చిత్ర పటానికి పూలు వేసి నివాళు లర్పించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు. భారత రాజ్యాంగం కల్పించిన హక్కులను కాపాడు కోవడమే అంబేద్కర్‌కు నిజమైన నివాళి అని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం జిల్లా కార్యదర్శి రాకోటి ఆనంద్ అన్నారు. బొగ్గుల దిబ్బ ఎస్‌సి కాలనీలో మంగళవారం ఆయన అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో కాలనీ ప్రజలు ఎం.శ్రీను, చిన్నా, సూర్యకళ, సింహాచలం పాల్గొన్నారు.

వంగర: అంబేద్కర్ ఆశయాలను కొనసాగిద్దామని ఎంపిపి ఉత్తరావల్లి సురేష్ ముఖర్జీ అన్నారు. అంబేద్కర్ వర్ధంతిని పురస్కరించుకుని అంబేద్కర్ విగ్రహానికి తహశీల్దార్ డి. ఐజాక్‌తో కలిసి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. అరసాడ, శివ్వాం, తలగాం గ్రామాలతో పాటు వివేక్ మాస్టర్ మైండ్ పాఠశాలలో అంబేద్కర్ వర్ధంతి వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బొక్కేల వెంకట అప్పలనాయుడు, కనగల పారినాయుడు, బెవర ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వేపాడ: మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహానికి టిడిపి మండల పార్టీ అధ్యక్షులు గొంప వెంకటరావు ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. టిడిపి నాయకులు పాల్గొన్నారు. మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహానికి దళిత సేవ సేన జిల్లా అధ్యక్షుడు కొమనాపల్లి రవి ప్రసాద్, దళిత మహ సభ అధ్యక్షుడు కోమనాపల్లి రాము, గుత్తి శ్రీనివాస్ పూలమాలవేసి నివాళులర్పించారు.

మెంటాడ : అంబేద్కర్ ఆశయాలను కొనసాగే విధంగా కృషి చేయాలని సిపిఎం జిల్లా సహాయ కార్యదర్శి రాములు పేర్కొన్నారు. మంగళవారం చల్లపేట, మెంటాడ ప్రాధమిక ఆరోగ్య కేంద్రాలలో అంబేద్కర్ వర్ధంతి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చల్లపేట వైద్యాధికారిణి సంజయ్ రాణి, గిరిజన సంఘం మండలం కార్యదర్శి తామరాపల్లి సోముడు, ఇఒ కె. శ్రీనివాసురావు, హెచ్ఎస్ పైడన్న, హెచ్‌వి సత్యవతి, గేదెల సుజాత, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

గుర్ల: మండల కేంద్రంలో అంబేద్కర్ విగ్రహానికి ఎంపిపి పొట్నూరు ప్రమీల, ఎయిమ్ జిల్లా కార్యదర్శి కెల్ల బీమారావు, తెట్టంగిలో టిడిపి బిసిసెల్ కార్యనిర్వాహక కార్యదర్శి వెన్నె సన్యాసి నాయుడు అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. **నెల్లిమర్ల:** రామతీర్థం జంక్షన్‌లో అంబేద్కర్ విగ్రహానికి మాలమహానాడు రాష్ట్ర ప్రదాన కార్యదర్శి లోగిశ రామకృష్ణ పూలమాలవేసి నివాళులర్పించారు. **బొబ్బిలిరూరల్ :** నారాయణప్పవలస పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు జె.సి.రాజు అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. పాల్గొన్నారు. స్టేట్ బ్యాంకు సమీపంలో ఉన్న అంబేద్కర్ విగ్రహానికి టిడిపి నియోజకవర్గ ఇంఛార్జి బేబినాయన, ఎస్‌సి ఉద్యోగుల సంఘం నాయకులు బి.చిరంజీవులు, కళింగ వైశ్య సంఘం నాయకులు ఎస్.సాయిరమేష్, రిటైర్డ్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు రౌతు రామమూర్తి పూలమాలలు వేసి1 నివాళులర్పించారు.

డిగ్రీ కళాశాల సమస్యలు పరిష్కరించాలి : ఎస్‌ఎఫ్ఐ

ప్రజాశక్తి-గజపతినగరం

ప్రభుత్వ డిగ్రీ కాలేజీ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన మంగళవారం తహశీల్దార్ కార్యాలయం వద్ద విద్యార్థులు ధర్నా చేశారు. కాలేజీకి సొంత భవనం మంజూరు చేసి అధ్యాపక పోస్టులు మంజూరు చేయాలని మౌలిక సదుపాయాలు కల్పించాలని జిల్లా సహాయ కార్యదర్శి డి.రాము డిమాండ్ చేశారు. అధ్యాపకులు లేకపోవడంతో విద్యార్థులు చదువుకు దూరం అవుతున్నారని అన్నారు. ఒకవైపు రాష్ట్ర ప్రభుత్వం ఎఫ్ఆర్ఎస్ ద్వారా హాజరు వేయాలని, అటెండెన్స్ ఉన్నవాళ్లకే విద్యా దీవెన వసతి దీవెన వస్తుందని చెబుతోందని, దీనితో విద్యార్థులు అధ్యాపకులు లేకుండా కాలేజీకి వచ్చి ఏం చేయాలని ప్రశ్నించారు. మరోవైపు కనీస మౌలిక సదుపాయాలు లేకపోవడంతో విద్యార్థులు మౌలిక సదుపాయాల రైల్వే ట్రాక్ మీదకు వెళ్లి కాల కృత్యాలు తీర్చుకుంటున్నారని తెలిపారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం సొంత భవనం, అధ్యాపకు పోస్టులు మంజూరు చేయాలని కోరారు. అనంతరం డిప్యూటీ తహశీల్దార్ సత్యనారాయణకు వినతి అందజేశారు. కార్యక్రమం ఎస్ఎఫ్ఐ మండల నాయకులు 1కల్పన, మండల కమిటీ సభ్యులు లక్ష్మణ్,సాయి,కూర్మారావు పాల్గున్నారు

ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర మహాసభ విజయవంతానికి ప్రచారం

ప్రజాశక్తి- భోగాపురం, పూసపాటిరేగ

భోగాపురం: పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సిఐటియు నాయకులు, ఆశా కార్యకర్తలు

ఈ నెల 12,13, 14 తేదీల్లో విజయనగరంలో జరిగే ఎపి ఆశావర్కర్స్ యూనియన్ (సిఐటియు) 4వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ జిల్లాలో పలుచోట్ల మంగళవారం ఆయూనియన్ నాయకులు వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. పోలిపల్లి సిహెచ్‌సి, పూసపాటిరేగ పిహెచ్‌సి వద్ద సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కాకి సురేష్ , జిల్లా కార్యదర్శి బి.సూర్యనారాయణ, ఆశావర్కర్స్ యూనియన్ నాయకులు మంగళవారం పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో యూనియన్ సభ్యులు కనకమహాలక్ష్మి, నాగలక్ష్మి, రాజేశ్వరి, సౌజన్య, సత్యవతి, పార్వతి, శ్రీదేవి, పాల్గొన్నారు.

గజపతినగరం : మహాసభలను విజయవంతం చేయాలనిసిఐటియు నాయకులు జి శ్రీనివాస్, ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు బేబీ కోరారు. మరుపల్లి పిహెచ్‌సివద్ద పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉదయం 10 గంటలకు విజయనగరం రైల్వే స్టేషన్ నుండి జరుగు ర్యాలీ బహిరంగ సభలో జిల్లాలో ఉన్న ఆశా వర్కర్లందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఆశాలు రాజేశ్వరి, ఉమా, దేవి పాల్గొన్నారు. **శృంగవరపుకోట:** మహాసభను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి మద్దెల రమణ పిలుపునిచ్చారు. కొట్టాం పిహెచ్‌సి వద్ద గోడ పత్రికను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో డి సాంబమ్మ, ఆర్ రమణమ్మ, ఎన్ లక్ష్మి, బి లక్ష్మి, సిహెచ్ గంగ భవాని, ఏ పార్వతి, ఎస్ కన్నమ్మ, తదితరులు పాల్గొన్నారు. **రేగిడి:** మహాసభలను విజయవంతం చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి సిహెచ్ రామమూర్తి నాయుడు పిలుపునిచ్చారు. ఆశా కార్యకర్తలతో కలిసి వాల్ పోస్టర్‌ను విడుదల చేశారు. యూనియన్ నాయకులు పద్మ, సరస్వతీ, లక్ష్మి, నందినీ, నారాయణమ్మ, లక్ష్మి, ఈశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు. **వేపాడ:** మహసభలను జయప్రదం చేయాలని సిఐటియు నాయకులు చల్లా జగన్ కోరారు. బొద్దాం పిహెచ్‌సి వద్ద మహాసభలకు సంబంధించిన కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు. **కొత్తవలస:** మహాసభలను విజయవంతం చేయాలని సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు గాడి అప్పారావు పిలుపునిచ్చారు. ఆశా డే సందర్భంగా కొత్తవలస పిహెచ్‌సిలో మంగళవారం సమావేశం నిర్వహించారు. అనంతరం గోడ పత్రికను ఆవిష్కరించారు. **గుర్ల:** ఆశా వర్కర్ల జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని యూనియన్ ప్రధాన కార్యదర్శి సుధారాణి కోరారు. పోస్టర్ ఆవిష్కరణలో ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు. **లక్కవరపుకోట:** మహాసభలను జయప్రదం చెయ్యాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు గాడి అప్పారావు పిలుపునిచ్చారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రాంగణంలో మంగళవారం ఆశా వర్కర్లతో కలిసి గోడ పత్రికను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆశా కార్మికులు వి ఈశ్వరమ్మ , దేవి, డి దేవిరాణి, ఎస్ సరస్వతి, డి నారాయణమ్మ, కర్రీ భవాని తదితరులు పాల్గొన్నారు. **బొబ్బిలిరూరల్ :** పిరిడి పిహెచ్‌సి ఆవరణలో ఆ యూనియన్ జిల్లా అధ్యక్షులు లంక శాంతమ్మ ఆధ్వర్యంలో గోడపత్రికను విడుదల చేసారు. కార్యక్రమంలో రవణమ్మ కష్ణవేణి ఆశాలు పాల్గొన్నారు. **విజయనగరం టౌన్:** మహాసభను విజయవంతం చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి జగన్మోహన్‌రావు, ఆశావర్కర్స్ యూనియన్ నాయకులు వెంకటలక్ష్మి, మహాలక్ష్మి పిలుపునిచ్చారు. ఆశా డే సందర్భంగా విజయనగరం అర్బన్, రాకోడు పిహెచ్‌సిలో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈశ్వరమ్మ, పద్మ, అప్పయ్యమ్మ పాల్గొన్నారు.

అభివాదం చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

విద్యారంగ నిర్వీర్యానికి కుట్ర

ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు రామ్మోహన్

ప్రజాశక్తి-కలెక్టరేట్

ప్రభుత్వ విద్యారంగాన్ని నిర్వీర్యం చేయడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కుట్ర పన్నుతున్నాయని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.రామ్మోహన్ విమర్శించారు. మంగళవారం పార్వతీపురంలోని ఎన్‌జిఒ హోంలో జరిగిన ఎస్ఎఫ్ఐ జిల్లా మహాసభలో ఆయన మాట్లాడారు. హక్కుల కోసం పోరాడుతున్న విద్యార్థులను నిర్బంధిస్తూ, అరెస్టులు చేయడం చాలా దుర్మార్గమన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యార్థుల హక్కులను కాలరాసే పనిలో నిమగ్నమై ఉన్నాయి తప్ప విద్యార్థులకు సమస్యలను పరిష్కరించే ఆలోచన చేయకపోవడం విచారకరమన్నారు. పార్వతీపురంలో చేపట్టిన ఎయిడెడ్ పోరాటం రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఎయిడెడ్ విద్యార్థులలో ఉత్తేజాన్ని నింపిందని తెలిపారు. మహాసభలో పార్వతీపురం, పాలకొండ కేంద్రాల్లో పీజీ సెంటర్, సాలూరులో ఇంజినీరింగ్ కళాశాల, సీతంపేటలో మెడికల్ కళాశాల ఏర్పాటు చేయాలని, గిరిజన యూనివర్సిటీ నిర్మాణ పనులు వెంటనే ప్రారంభించాలి. పార్వతీపురంలో గిరిజన పోస్ట్ మెట్రిక్ హాస్టళ్లకు అదనపు భవనాలను నిర్మించాలని తీర్మానాలు చేశారు. ం1

జిల్లా కమిటీ ఎన్నిక

ఎస్ఎఫ్ఐ పార్వతీపురం మన్యం జిల్లా నూతన కమిటీని 19 మందితో ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా డి.పండు, కార్యదర్శిగా పి.రాజశేఖర్, ఉపాధ్యక్షులుగా కె.రాజు, వరుణ్, సహాయ కార్యదర్శులుగా కె.భాస్కర్, బి.గంగారావు, చిన్నారి, జగదీష్ ఎన్నికయ్యారు.

హింస లేని సమాజం కావాలి: ఐద్వా

ప్రజాశక్తి- గజపతినగరం

సదస్సులో మాట్లాడుతున్న ఐద్వా జిల్లా కార్యదర్శి

హింస లేని సమాజం కావాలని ఐద్వా జిల్లా కార్యదర్శి పి. రమణ్మ కోరారు. స్థానిక సిద్ధార్థ కాలేజీలో ఐద్వా, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఐద్వా జిల్లా సహాయ కార్యదర్శి ఆర్ హరి కృష్ణవేణి అధ్యక్షతన మంగళవారం సదస్సు జరిగింది. ఈ సదస్సులో ఆమె మాట్లాడుతూ దేశంలోని రోజు రోజుకి మహిళలు, చిన్నారుల పైన అత్యాచారాలు జరుగుతున్నాయన్నారు. సమాజం తలదించుకునే స్థితికి తీసుకొచ్చారన్నారు. పాలకుల విధానాలు మహిళలను కించపరిచే విధంగా ఉన్నాయని మంత్రుల సైతం వేషధారణ పైన, అవయవాల పైన మాట్లాడి అగౌరపరుస్తున్నారని అన్నారు. కొన్ని సంస్థలు మూఢ విశ్వాసాలను రోజు ప్రచారం చేస్తున్నాయని మనువాద, భూస్వామ్య భావజాలాన్ని పెంచిపోసిస్తున్నాయని అన్నారు. మహిళలు సాధికారత సాధించాలని, అన్ని రంగాల్లో ముందుండాలని కోరారు. బిజెపి పాలిత రాష్ట్రాల్లో అత్యాచారాలు విపరీతంగా పెరిగాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మద్యాన్ని ఏరులా పారిస్తుంటే హింస ఎలా తగ్గుతుందని ప్రశ్నించారు. హింస లేని సమాజ సాధనకు అందరూ కంకణ బద్దులు కావాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ గజపతినగరం గర్ల్స్ కన్వీనర్ కల్పన, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆతవలో 'ఇదేం కర్మ మన రాష్ట్రానికి'



వేపాడ: వినతిపత్రాన్నిస్తున్న మాజీ ఎమ్మెల్యే

వేపాడ : మండలంలోని ఆతవ గ్రామంలో మంగళవారం టిడిపి మండల పార్టీ అధ్యక్షులు గొంప వెంకటరావు అధ్యక్షతన ఇదేమి కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి మాట్లాడు తూ వైసిపి ప్రభుత్వం బిసిలకు తీరన అన్యాయం చేస్తుందన్నారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయానికి చేరుకని ఉప తహసీల్దార్‌కు వినతి పత్రాన్ని అందించారు. దీనికి ముందు సోమవారం రాత్రి బల్లంకి గ్రామంలో ఇదేమి కర్మ రాష్ట్రానికి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమ ంలో రాష్ట్ర తెలుగుదేశం పార్టీ సమన్వయ కమిటీ సభ్యుడు కోళ్ల బుచ్చి రాంప్రసాద్, నాయకులు దాసరి లక్ష్మి, గుమ్మడి భారతి, పోతల రమణ, పాల్గొన్నారు.

గరివిడి: చీపురుపల్లి పట్టణంలో మండల ప్రజా పరిషత్ కార్యాలయం ఎదుట ఇదేమి కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం లో భాగంగా నాలుగు మండ లాల నాయకులు, కార్యకర్తలు టిడిపి విజయన గరం పార్లమెంట్ ఇంచార్జ్ కిమిడి నాగార్జున ఆధ్వర్యంలో ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం ఏర్పడ్డాక పరిశ్రమలు లేక చదువు పూర్తి చేసుకున్న నిరుద్యోగులు ఇతర రాష్ట్రాలకు తరలిపోతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి చీపురుపల్లి, గరివిడి మండల అధ్యక్షులు ముల్లు రమణ, సారిపాక సురేష్, రైతు సంఘం అధ్యక్షులు పైల బలరాం, రౌతు కామునాయుడు పాల్గొన్నారు.

పూసపాటిరేగ: అవినీతి ప్రభుత్వాన్ని ప్రజలంతా ఏకమై గద్దె దించాలని మాజీ మంత్రి పతివాడ నారాయణ స్వామి నాయుడు తెలిపారు. మంగళవారం మండ లంలోని పేరాపురంలో ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి ప్రచార కార్యాక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి మహంతి చిన్నంనాయుడు, బొంతు అప్పలనాయుడు, ఉమా పాల్గొన్నారు.

శిక్షణ కేంద్రంగా అవంతి కళాశాల ఎంపిక

ప్రజాశక్తి- గరివిడి

ఒప్పంద పత్రాలను మార్చుకుంటున్న ప్రతినిధుల

స్థానిక అవంతీస్ ఇంజనీరింగ్ కాలేజీను హిందుస్థాన్ రోవర్స్ అండ్ రేంజర్స్ అసోసియేషన్‌కు ట్రైనింగ్ కేంద్రంగా ఎంపిక చేశారు. మంగళవారం ఈ సంస్థ విశాఖపట్నం ట్రైనింగ్ కేంద్రంగా ఉమ్మడి విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల సమన్వయకర్త శ్రీనివాస్ చౌదరి, రిసోర్స్ పర్సన్ రామకృష్ణలు ఎంపిక చేసి, అగ్రిమెంట్ చేసుకున్నారు. ఈ సందర్భంగా కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ వి. జాషువ జయప్రసాద్ మాట్లాడుతూ ఇది ఒక అంతర్జాతీయ సేవా సంస్థ అని చెప్పారు. గతంలో ఈ సంస్థ ప్రాథమిక, ఉన్నత పాఠశాలలో శిక్షణ ఇచ్చేదని ఇప్పుడు కాలేజీల్లో శిక్షణ ఇస్తుందని అన్నారు. ఉమ్మడి విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలలో ఎన్‌టియు గురజాడ విజయనగరం తరువాత తమ కాలేజీని ట్రైనింగ్ కేంద్రంగా ఎంపిక చేయడం శుభపరిణామమన్నారు. శిక్షణలో భాగంగా విద్యార్థులకు రాత పరీక్ష, గ్రౌండ్ యాక్టివిటీస్ మూడు స్థాయిలో నిర్వహిస్తారని తెలియజేశారు. ప్రాథమిక స్థాయిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేస్తారని రెండవ స్థాయిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు గవర్నర్ చేతుల మీదుగా ద్రోణాచార్య అవార్డు అందజేస్తారని అన్నారు. వీటితోపాటు బస్సు రవాణా సౌకర్యంలో 50 శాతం రాయితీని ఇస్తారన్నారు. మూడవ స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు రాష్ట్రపతి అవార్డు అందజేస్తారన్నారు. వీటితోపాటు రైల్వే, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో 2శాతం రిజర్వేషన్ ఇస్తారన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ బి.వెంకటరమణ, ఎఒ జి.అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

ఓటుహక్కు వజ్రాయుధం

ప్రజాశక్తి - నెల్లిమర్ల

ఓటు హక్కుపై ప్రచార కర పత్రాన్ని ఆవిష్కరిస్తున్న విసి

ప్రజాస్వామ్య దేశాలలో ప్రజలకు ఓటుహక్కు ఓ వజ్రాయుధం వంటిదని వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ జిఎస్ఎన్ రాజు అన్నారు. మంగళవారం ఎస్‌బిసిసి ఆధ్వర్యంలో సెంచూరియన్ విశ్వవిద్యాలయంలో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రతి ఒక్కరూ ఓటుహక్కు కలిగి ఉండాలన్నారు. అర్హులైన వారు తమ ఓటు హక్కును నమోదు చేసుకోవాలన్నారు. లింగ వివక్ష గురించి మాట్లాడుతూ సమాజంలో మగ, ఆడ పిల్లలు అనే వ్యత్యాసం లేకుండా ఉండాలన్నారు. మహిళలను గౌరవించడంతోపాటు అందరికీ సమాన అవకాశాలు ఉన్నయన్న విషయాన్ని గుర్తెరగాలన్నారు. అనంతరం పోస్టర్ ను ప్రదర్శించారు.

ఉన్నత లక్ష్యాలతో ముందడుగు వేయాలి

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో ముందడుగు వేయాలని ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ పి. శ్రీకర్ పిలుపునిచ్చారు. ఇంజనీరింగ్ విద్యార్థులు మొదటి స్థానం నుంచే ప్రతి ఒక్కరూ ఉన్నత లక్ష్యంతో చదువులో పరుగులు తీయాలన్నారు. సాదాసీదా చదువులు ఉన్నత స్థానానికి తీసుకెళ్లలేవని స్పష్టం చేశారు. సాఫ్ట్ వేర్ రంగంలోనైనా, పోటీ పరీక్షలలోనైనా కష్టపడి చదవడంతోపాటు స్మార్ట్ వర్క్ పద్ధతులను అనుసరించాలన్నారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పిఎస్వి రమణారావు, డిప్యూటి రిజిస్ట్రార్ డాక్టర్ ఆర్ఎస్ వర్మ, పారా మెడికల్ డీన్ డాక్టర్ ఎం.లక్ష్మీనరసింహాచార్యులు, ఎస్‌బిసిసి జిల్లా కోఆర్డినేటర్ రామకృష్ణ, డాక్టర్ సతీష్, పలువురు ఇంజనీరింగ్ విద్యార్థులు పాల్గొన్నారు.

బిసిలకు అధిక ప్రాధాన్యత: ఎమ్మెల్సీ

ప్రజాశక్తి - నెల్లిమర్ల

ఎమ్మెల్సీ సురేష్‌బాబ

వైసిపి ప్రభుత్వం బిసిలకు అధిక ప్రాధాన్యత ఇస్తుందని ఎమ్మెల్సీ డాక్టర్ పి. సురేష్ బాబు అన్నారు. మంగళ వారం ఆయన విలేఖర్లతో మాట్లాడుతూ గతంలో బిసిలకు ఏ ప్రభుత్వాలు ఇవ్వని ప్రాదాన్యత వైసిపి ప్రభుత్వం కల్పిస్తుందన్నారు. ఇందులో భాగంగానే 14మందికి మంత్రివర్గంలో చోటు కల్పించిందన్నారు. ముఖ్యంగా ప్రభుత్వానికి బిసిలు వెన్నెముకగా నిలిచి ముందుకు నడిపిస్తున్నారన్నారు. ప్రభుత్వం అందిస్తున్న రూ.1.77లక్షల కోట్ల సంక్షేమ పథకాల్లో రూ.86వేల కోట్ల సంక్షేమ పథకాలను బిసిలకు అందించడం జరిగిందన్నారు. టిడిపి, జనసేనలు బిసిల జపం చేసి రెచ్చగొడుతున్నారని రాష్ట్ర ప్రజల నమ్మే స్థితిలో లేరని అన్నారు. తనను పాత పట్నం నియోజకవర్గం పరిశీలకులుగా నియమించి నట్లు ఎమ్మెల్సీ సురేశ్ బాబు ఈ సందర్భంగా తెలిపారు. తన తండ్రి స్వర్గీయ మాజీ మంత్రి సాంబశివరాజు బిసిల సహకారంతో 50 సంవత్సరాలు పాటు ప్రజా సేవలో నిలిచారని గుర్తు చేశారు. ఈ నెల 7న విజయవాడలో జరగనున్న జయహో బిసి సభకు బిసి వర్గాలు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని ఆయన కోరారు.

భాగస్వాములను చేయాలి

నెల్లిమర్ల : సమాజంలో జరిగే అన్ని కార్యక్రమాలలోనూ వికలాంగులను భాగస్వా ములను చేయాలని సమగ్ర శిక్షా జిల్లా సహిత విద్య సమన్వయాధికారి ఎస్. సూర్యారావు, ఎంపిడిఒ గిరిబాల అన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణం లోని భవిత కేంద్రం వద్ద ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు సహాయ ఉపకరణాల నిర్ధారణ వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వికలాంగ పిల్లలను సాధారణ పిల్లలతో సమానంగా చూడాల న్నారు. సమగ్ర శిక్షా ద్వారా ప్రత్యేక అవసరాల గల పిల్లలకు విద్యతో పాటు పలు కార్యక్రమాలు చేపడు తున్నట్లు చెప్పారు. పబ్లిక్ పరీక్షల్లో తగ్గింపు మార్కుల మినహాయింపుతో పాటు అదనపు సమయం, సహాయకులు వంటి సౌకర్యాలు విద్యాశాఖ ఏర్పాటు చేస్తోందన్నారు. ఈ కార్యక్రమానికి విజయనగరం, నెల్లిమర్ల, గుర్ల మండలాలకు చెందిన 106మంది వికలాంగ పిల్లలు హాజరయ్యారు. వీరికి వైద్యులు తేజ్ కుమార్, రామకృష్ణ రాజులు వైద్య నిర్ధారణ పరీక్షలు జరిపి 66 మంది వికలాంగల పిల్లలను వినికిడి యంత్రం, వీల్ చైర్, కాలిపర్స్ వంటి ఉపకరణాలకు ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ రమణరాజు, జిల్లా సహితవిద్య సహాయ సమన్వయకర్త ఎం. భారతి, ఎంఇఒ ఏ. కృష్ణారావు, ఇఒపిఆర్‌డి భానోజీరావు, మూడు మండలాల సహితవిద్య ఉపాధ్యాయులు, ఎమ్మార్సీ సిబ్బంది, వికలాంగులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ట్రాక్టర్లు ఢీకొని ఒకరు మృతి

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని బక్కు నాయుడుపేట జంక్షన్ వద్ద ఎదురెదురుగా వస్తున్న రెండు ట్రాక్టర్లు బలంగా ఢీ కొనడంతో అదే గ్రామానికి చెందిన డ్రైవర్ కోన సత్తిబాబు (32) మృతి చెందాడు. ఈ ప్రమాదం జరిగిన సమయంలో వెనుక నుంచి ట్రాక్టర్‌ను బైకు ఢీ కొనడంతో బైక్ పై వచ్చిన అదే గ్రామానికి చెందిన కొంప రాజు (19)కు గాయాలయ్యాయి. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు 108 వాహనంలో రాజును ఎస్‌కోట ప్రభుత్వ ఆసుపత్రికి మెరుగైన వైద్యం కోసం తరలించారు.

రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన సత్తిబాబు